

శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రీతం రెడ్డి తదితరులు

హనుమాన్ శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 12న శోభయాత్ర నిర్వహిస్తున్నట్లు రామ్‌సేన కేపీహెచ్‌బీ అధ్యక్షుడు సర్విగారి ప్రీతంరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం సాయంత్రం శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. రమ్యగ్రౌండ్ నుంచి సాయంత్రం 5.30 గంటలకు శోభాయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై దిగ్విజయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, అరవింద్, సత్యనారాయణ, కోటేశ్వరరావు, పవన్ కుమార్ వర్మ, కోళ్ల శంకర్, తుల్జా గణేష్, రమేష్, వంశీ, రాజిరెడ్డి, వెంకట్, సాయితేజ, ఆకుల రాములు, ప్రకాష్, ప్రేమ్ తదితరులు ఉన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు (కిలో, రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమోట 11, వంకాయ 23, బెండకాయ 35, పచ్చి మిర్చి 45, బజ్జి మిర్చి 35, కాకరకాయ 35, బీరకాయ 38, క్యాబేజీ 10, బీన్స్ 65, క్యారెట్ 18, గోబి పువ్వు 18, దొండకాయ 28, చిక్కుడు కాయ 55, గోరు చిక్కుడు 35, బీట్‌రూట్ 15, క్యాప్సికం 43, ఆలుగడ్డ 25, కీర 18, దోసకాయ 18, సొరకాయ 15, పొట్లకాయ 20, కంద 75, ఉల్లిపొరక 23, ఉల్లిగడ్డ 24, మామిడి కాయ 15-20, అరటికాయ 8-9, చామగడ్డ 38, ముల్లంగి 4-5, చిలగడ దుంప 30, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు 60-70, మునగ కాయలు 5-6, పచ్చిబఠాణి 40, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండు మిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, పండు మిర్చి 80, ఉసిరి 95, కరివేపాకు 70, పర్వల్ రూ.60, పల్లికాయ 50, లోబా 25, ఆ కాకరకాయ 60. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

శ్రీరామనవమికి ఆలయాలు ముస్తాబు

- సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం
- అన్ని ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి హిందువులకు అతి ముఖ్యమైన పండుగ. సీతారాముల కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం కూడా కూకట్‌పల్లిలోని శ్రీ సీతారామాలయంలో వైభవంగా నిర్వహిస్తారు. ఆలయంలో ఏర్పాట్లపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేక దృష్టిసారించారు. ఇప్పటికే పలు విభాగాలకు చెందిన అధికారులతో మాట్లాడి ట్రాఫిక్, శాంతి భద్రతలు, పారిశుధ్యం, విద్యుత్ అలంకరణ, టెంట్‌లు, అన్నదాన ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆదివారం సెలవు కావడంతో సీతారాముల కల్యాణానికి సుమారు 80 వేల నుంచి లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనావేస్తున్నారు. దానికి తగ్గట్టుగానే అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కూకట్‌పల్లి పరిధిలోని పాపిరెడ్డి కాలనీ వీరాంజనేయదేవాలయం, ఆస్‌బెస్టస్‌కాలనీలోని రామాలయంతో పలు ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు.



రామాలయం గుడికి రంగులు వేస్తున్న కళాకారుడు



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ఎండవేడి తగలకుండా ఏర్పాటు చేస్తున్న టెంట్‌లు



రేపు పట్టాభిషేకం

కూకట్‌పల్లి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఉదయం 10.30ల నుంచి సీతారాములు కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. కల్యాణం కోసం రామాలయం ఎదురుగా ప్రాంగణం సిద్ధం చేశారు. వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా టెంట్‌లు వేశారు. బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం యాగశాల ప్రవేశము, అగ్ని ప్రతిష్ట నిర్వహించారు. యాగశాలలో నిర్వహించిన పూజల్లో నాయినేని శ్రీనివాసరావు (తులసి) హేమలత దంపతులు పాల్గొన్నారు. సోమవారం సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించనున్నారు. పట్టాభిషేకంలో సీతారాములకు బంగారు (స్వర్ణ) కిరీటం ధరించనున్నారు.

వివిధ ప్రాంతాల్లో కాల్యాణానికి ఏర్పాట్లు

బాలానగర్/ఫతేనగర్/ఓల్డుబోయినపల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): సీతారాముల కల్యాణ వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు అంజనేయ స్వామి, రామాలయం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. కల్యాణం తిలకించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఆలయం ముందు పందిర్లు వేసి ముస్తాబు చేశారు. బాలానగరలోని వీరాంజనేయ స్వామి ఆలయం, చరబండరాజు కాలనీ ఆంజనేయ స్వామి ఆలయం, రాజూ కాలనీ రామాలయం, ఇందిరానగర్ ఆంజనేయియ స్వామి ఆలయం, గీతానగర్ శ్రీకృష్ణ ఆలయం, శ్రీ కనకదుర్గాదేవి స్పటిక లింగేశ్వర ఆలయం. ఫతేనగర్‌లోని హరిహర కళాక్షేత్రం, ఎల్‌బీఎస్ నగర్ అంజనేయ స్వామి ఆలయం, రామాలయం, ఓల్డు ఎయిర్ పోర్టు రోడ్డులో ఆంజనేయ స్వామి ఆలయం, ఓల్డుబోయిన పల్లిలో హస్మత్‌పేట్ ప్రసన్నాంజనేయ స్వామి టెంపుల్, అంజయ్యనగర్ హనుమాన్ టెంపుల్, ఓల్డుబోయినపల్లి హనుమాన్ టెంపుల్స్‌లో సీతారాముల కల్యాణ వేడుకలు జరుగనున్నాయి.

- కేపీహెచ్‌బీకాలనీలో సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు చేశారు. బాలాజీనగర్, ఆంజనేయనగర్, సర్దార్‌పటేల్‌నగర్, టెంపుల్ బస్టాపు, వసంతనగర్, ధర్మారెడ్డి కాలనీ ఫేజ్-1, కాలనీల్లో వేడుకలకు ఏర్పాట్లు చేశారు.

ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లపై జీహెచ్‌ఎంసీ ఫోకస్

- పనికిరాని వస్తువుల సేకరణకు అధికారుల ప్రత్యేక డ్రైవ్
- కూకట్‌పల్లి సర్కిల్‌లో ప్రతి శనివారం తరలింపునకు శ్రీకారం

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మీ ఇంట్లో ఉన్న పాత దుస్తులు మీకు అవసరం లేదా? పాత ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ పరికరాలు, పాత సామన్లు, పాత పుస్తకాలు ఇంకా మీ ఇంట్లో అవసరం లేకుండా ఏమైనా ఉన్నాయా? అయితే మాకు చెప్పండి మేము తీసుకెళ్లి అవసరం ఉన్న వారికి ఇస్తామంటున్న జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు. ఇందుకోసం జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల పరిధిలో ఆర్‌ఆర్‌ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైక్లింగ్) సెంటర్‌లు ఏర్పాటు చేశారు. వీటికి ఆదరణ అంతంత మాత్రంగానే ఉంది. వీటిని బలోపేతం చేయడం, ప్రజలకు అవసరం లేని వాటిని ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా అడ్డుకోవడం కోసం అధికారులు ప్రణాళిక రచించారు.

జంట సర్కిళ్ల పరిధిలో...

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ, వివేకానందనగర్, కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్లకు గాను కూకట్‌పల్లి హుడా ట్రక్ పార్కు సమీపంలో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ఏర్పాటు చేయగా.. మూసాపేట్ సర్కిల్ పరిధిలో కేపీహెచ్‌బీ, బాలాజీనగర్, అల్లాపూర్, మూసాపేట్, ఫతేనగర్ డివిజన్లకు గాను మూసాపేట్‌లోని కూకట్‌పల్లి జోనల్ కార్యాలయం ఆవరణలోనే ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఆయా ప్రాంతాల్లోని ప్రజలు వారికి అవసరం లేని, ఉపయోగంలో లేని దుస్తులు, పరికరాలు, సామన్లు ఇక్కడ ఇస్తుండేవారు. అదే సమయంలో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు ఎవరైనా సరే వారికి ఉపయోగపడే, అవసరం ఉన్న వాటిని ఫ్రీగానే తీసుకెళ్తుండేవారు. ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లు దగ్గరలో ఉండే వారికి కాస్త ఫర్వాలేదు. కానీ దూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ ఇచ్చిపోయేవారు అంతగా లేరని అధికారులు గ్రహించారు. క్షేత్రస్థాయిలో పారిశుధ్య కార్మికుల దగ్గర నుంచి ఎస్‌ఎఫ్‌ఏలు, జవాన్లు, ఎస్‌ఆర్‌పీలకు అవగాహన కల్పించామని చెప్పినా ఆశించిన ఫలితాలు రావడం లేదు. కోవిడ్ తర్వాత ఏడాది పాటు బాగానే అన్నీ వార్డు కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన పాత దుస్తుల కలెక్షన్‌కు బాగానే ఆదరణ వచ్చినా ఆరు నెలల కాలంలోనే వాటిని తొలగించారు. సర్కిల్‌కు ఒకటి చొప్పున మాత్రం కొనసాగిస్తున్నారు. తాజాగా స్వచ్ఛ సర్వేక్షణ్-2024 సర్వేలో మంచి ఫలితాలు రాబట్టుకునేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలు కాస్త సత్ఫలితాలు ఇచ్చినట్లు సమాచారం. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలు తెరిచి ఉంటాయి.



పాత దుస్తులను సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు



పనికిరాని వస్తువులను తీసుకెళ్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

ప్రతివారం పాత వస్తువుల కలెక్షన్

కూకట్‌పల్లి సర్కిల్‌లో పాత దుస్తులు, ఫర్నిచర్, పరికరాలు, ఇతరత్రా వస్తువులను కాలనీలు, బస్తీల వద్దకు వచ్చి తీసుకెళ్లే కార్యక్రమానికి డీసీ బండి గంగాధర్, ఎస్‌డబ్ల్యూఎం డీఈఈ వేజెండ్ల కిషోర్ శ్రీకారం చుట్టారు. ఇప్పటికే గ్యాంగ్ వర్క్, చెత్తాచెదారం పడేయకుండా నర్సరీలు ఏర్పాటు చేయడంతో ముందుడుగులో ఉన్న సర్కిల్ అధికారులు తాజాగా పాత సామగ్రి సేకరణకు శ్రీకారం చుట్టారు. తొలిరోజు హైదర్‌నగర్ బృందావనం కాలనీ, బాలానగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి ఆర్‌ఆర్ కాలనీ, కూకట్‌పల్లి వెంకట్రావు నగర్‌లో పాత సామగ్రిని క్షేత్రస్థాయిలో ఆయా కాలనీలకు వెళ్లి సేకరించామని అధికారులు తెలిపారు. సర్కిల్ పరిధిలో ఏ కాలనీ, బస్తీ వారు అవసరం ఉన్నా జీహెచ్‌ఎంసీ పారిశుధ్య విభాగం సిబ్బందిని సంప్రదిస్తే చాలు. ప్రతి శనివారం జరిగే కార్యక్రమంలో అసోసియేషన్లు, బస్తీల నాయకులు, ప్రజలు భాగస్వామ్యం కావాలని అధికారులు కోరుతున్నారు.

సమాచారం ఇస్తే వచ్చి తీసుకెళ్తాం

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో ఆరు డివిజన్లు, 208 కాలనీలు, బస్తీలు ఉన్నాయి. కాలనీ లేదా బస్తీకు ఒకటి, రెండు, మూడు ప్రాంతాల్లో పనికరాని వస్తువులు ఒకచోట ఉంచి స్థానికంగా పనిచేసే ఎస్‌ఎఫ్, జవాన్లు, ఎస్‌ఆర్‌పీలకు సమాచారం ఇవ్వండి. ప్రతి శనివారం ప్రత్యేక డ్రైవ్ ద్వారా వాటిని తీసుకెళ్లి ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌కు తరలిస్తాం. వస్తువు ఏదైనా సరే ఇళ్ల ముందు, పార్కులు, మైదానాలు, రోడ్ల వెంట పడేయవద్దు. మీకు అవసరం లేనివి ఏవైనా సరే ఫ్రీగా తీసుకెళ్తాం. దీని వల్ల ఇతరులకు ఉపయోగపడటం లేదా పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు అవుతారని ఆశిస్తున్నాం.

- వేజెండ్ల శ్రీనివాసరావు, ఎస్‌డబ్ల్యూఎం డీఈఈ, కూకట్‌పల్లి సర్కిల్

బోరబండ ఎంఎంటీఎస్ రైళ్ల సమాచారం

అల్లాపూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బోరబండ ఎంఎంటీఎస్ స్టేషన్ నుంచి లింగంపల్లి, హైదరాబాద్, ఫలక్‌నుమ (వయా సికింద్రాబాద్) వైపునకు సమయ సూచికలు, రైల్వే స్టేషన్‌లో అధికారులు ఇచ్చిన సమాచారం. ++ గుర్తు కల్గిన ట్రైన్ సోమవారం నుంచి శుక్రవారం వరకు అని అర్థం. అనివార్య కారణాలతో ట్రైన్ రద్దు అవటం, సమయ సూచికలో మార్పుల కొరకు అల్లాపూర్‌లోని 'బోరబండ' ఎంఎంటీఎస్ స్టేషన్ అధికారులను సంప్రదించగలరు.

లింగంపల్లి వైపునకు: ఉదయం: 05:57, 06:12, 06:30++, 07:22, 08:17, 08:32, 09:02, 09:42, 09:42, 10:17, 10:17, 10:27++, 11:12
సాయంత్రం 16:57, 17:42++, 17:57, 18:27, 19:22, 19:15++ : రాత్రి 20:22, 20:42++, 29:02, 29:07, 29:42++, 22:12, 22:37, 23:17++, 00:17

ఫలక్‌నుమ వైపునకు
(వయా బేగంపేట, సికింద్రాబాద్, కాచిగూడ, మలకపేట):
ఉదయం 04:16, 06:16, 07:01, 07:41++, 8:46, 09:15, 09:51, 10:41
సాయంత్రం 16:31++, 17:29, 17:56++, 18:16, 18:56++, 19:36
రాత్రి 20:16++, 29:41, 29:51, 22:29, 23:05++, 23:40

హైదరాబాద్ వైపునకు: (వయా బేగంపేట, ఖైరతాబాద్, లక్డికపూల్)
ఉదయం 07:20, 08:15, 10:05
సాయంత్రం 16:20++, 17:30, 19:10 రాత్రి 20:13, 29:25

మేడ్చల్‌కు (వయా బేగంపేట, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, సఫిల్‌గుడ, అల్వాల్, బోల్లారం, గుండ్ల పోచంపల్లి, గౌడవల్లి,)
ఉదయం 10:26 సాయంత్రం 18:46

ఘట్‌కేసర్‌కు (వయా ఫిరోజ్‌గుడ, సుచిత్ర, నేరెడ్‌మెట్, చర్లపల్లి)
సాయంత్రం 17:36

ఫైనాన్స్ కార్యాలయంలో స్వల్ప అగ్ని ప్రమాదం

కూకట్‌పల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం సమీపంలోని ఓ భవనంలో స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. శనివారం బీజేపీ కార్యాలయం సమీపంలో ఉన్న ఓ భవనంలోని 3వ అంతస్తు నుంచి పొగలు రావడంతో స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వెంటనే వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఓ ఫైనాన్స్ కార్యాలయానికి సంబందించి కొన్ని ఫైల్స్‌కు మంటలు అంటుకోవడంతో పొగలు బయటకు వచ్చాయి. ఇదే విషయమై ఎస్‌ఎఫ్‌వో జగన్ మోహన్‌ను వివరణ కోరగా రాత్రి వేళ ఫ్యాన్ స్విచ్ ఆఫ్ చేయకపోవడంతో వేడెక్కి వైర్లు అంటుకున్నాయని తెలిపారు. స్వల్ప అగ్నిప్రమాదమని తెలిపారు.



బాలానగర్ చౌరస్తాలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు





బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పిస్తున్న దళిత ఐక్యవేదిక అధ్యక్షుడు ఎడ్ల ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల కవిత, వేదిక వద్ద తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల నృత్యాలు

● ఎమ్మెల్యే పరామర్శ

కూకట్‌పల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మూసాపేట మాజీ కార్పొరేటర్ చిన్నమ్మ మృతి చెందడంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శలో మాజీ కార్పొరేటర్ బాబురావు, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సతీష్ అరోరా, అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



దేశ మాజీ ఉప ప్రధాని డా. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జనసేన కూకట్‌పల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్, జన సేన నాయకులు



మూసాపేటలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కూకట్‌పల్లి బి-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తూము వేణుతో బాలకృష్ణ, ఎల్లేశ్ యాదవ్, భాస్కర్, నర్సింహ యాదవ్, బొజ్జమ్మ, గణేశ్, లక్ష్మీనారాయణ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.
-కూకట్‌పల్లి, ఆంధ్రజ్యోతి



ఓల్డుబోయినపల్లి చివరి బస్టాపులో కమిటీ సభ్యులతో కలిసి బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ నర్సింహ యాదవ్, తదితరులు
ఓల్డుబోయినపల్లి, ఆంధ్రజ్యోతి

కూకట్‌పల్లి జోన్‌బృందం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దేశ తొలి ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉప ప్రధానిగా బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఆయన చేసిన సేవలను నేతలు కొనియాడారు. ఆయన ఆశయాల కొనసాగింపునకు పాలకులు పాటుపడాలని కోరారు. ఈ వేడుకల్లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, హెచ్‌ఏఎల్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ రామ్మోహన్, హెచ్‌ఏఎల్ అధికారులు, జడ్సీ అపూర్వ్ చౌహాన్, జేసీ శంకర్, ఎస్ఈ చిన్నారెడ్డి, అల్లాపూర్ కార్పొరేటర్ సబీహ బేగం, కార్పొరేటర్ నర్సింహ్మాయాదవ్, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ తదితర పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సబీహ బేగం, తదితరులు



జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న జడ్సీ అపూర్వ్ చౌహాన్ తదితరులు



కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి, తదితరులు



హెచ్‌ఏఎల్‌లో నివాళులర్పించిన ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ రామ్మోహన్‌తో, హెచ్‌ఏఎల్ అధికారులు, కార్మిక నాయకులు



బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఇచ్చిన హామీ నేరవేర్చిన కాంగ్రెస్

● జగదీశ్వర్ గౌడ్

హైదర్‌నగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలో భాగంగా రేషన్ సన్నబియ్యం అమలు చేయడం జరిగిందని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. శనివారం వివేకానందనగర్ డివిజన్ రేషన్ దుకాణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ చరిత్ర సృష్టించిందని, ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 89.95 లక్షల రేషన్ కార్డు దారులకు రూ.2.81 కోట్ల మంది అర్హులకు లబ్ధి చేకూరుతుందన్నారు. రాష్ట్రంలో పేదలందరికి ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందని, రాష్ట్రంలో దాదాపు 84 శాతం మంది పేదలకు ప్రభుత్వం ఉచితంగా సన్నబియ్యం అందించబోతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, డివిజన్ అధ్యక్షుడు యాదగిరి, రంగారెడ్డి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు కల్పన ఏకాంత్‌గౌడ్, నాగమణి, భాస్కర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
హరిబాబు : 99854 11086

ఎటుచూసినా చెత్తకుప్పలే..!


తారానగర్‌లో పేరుకుపోయిన చెత్తకుప్పలు


రాఘవేంద్రకాలనీలో ఇళ్లమధ్యలో పేరుకుపోయిన చెత్తకుప్ప

- శేరిలింగంపల్లిలో పేరుకుపోతున్న చెత్త
- పట్టించుకోని అధికారులు
- తరలింపులో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రైవేటు ఏజెన్సీ

గచ్చిబౌలి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. వీధులను శుభ్రంచేసే కార్మికులు, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్త తీసుకువచ్చి సమీపంలో ఉన్న చెత్తకుప్పల్లో పడేస్తున్నారు. దీంతో చెత్త పేరుకుపోయి రోజుల తరబడి నిలువ ఉండడంతో దర్గంధం వెదజల్లుతుందని స్థానికులు వాపోతున్నారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండాపోతుందని వారు విచారం వ్యక్తంచేస్తున్నారు. లింగంపల్లి, తారానగర్, గోపీనగర్, ఆదర్శనగర్, మసీదుబండ, కొండాపూర్, గచ్చిబౌలి, రాఘవేంద్రకాలనీ తదితర ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని ఆవేదనవ్యక్తంచేస్తున్నారు. చెత్త పేరుకుపోయి రోజు రోజుకు దుర్గంధంతోపాటు ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయని అంటున్నారు. చెత్తను తరలించాల్సిన ప్రైవేటు ఏజెన్సీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు తెలిపారు. జీహెచ్ఎంసీ అధికారులు మాత్రం చెత్త తరలింపు పనులు రాంకీ అనే ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. జీహెచ్ఎంసీ కిందిస్థాయి ఉద్యోగులు ఏజెన్సీ అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడంలేదని సిబ్బంది వాపోతున్నారు. ఒక్కోసారి అధికారులు ఫోన్‌చేసినా స్పందించడంలేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రైవేటు ఏజెన్సీ అధికారులు కానీ జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే స్పందించి పేరకుపోయిన చెత్తకుప్పలను వెంటనే తరలించాలని ఈ ప్రాంతాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణం

వీధుల్లో చెత్తపేరుకపోతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఫిర్యాదుచేసినా ఎవరూ స్పందించరు. ఎవరికి చెప్పుకోవాలో తెలియని స్థితిలో ఉన్నాం. దోమల బాధతో కంటి నిండా నిద్రలేదు. కాలనీ పక్కనే చెరువు ఉంది. అందులో గుర్రపు డెక్క పేరుకుపోయి ఉంది. దానిని పట్టించుకున్నా పాపాన పోలేదు. అధికారులు, స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి. లేకుంటే సర్కిల్ కార్యాలయం ముందు ధర్నాచేయాల్సి వస్తుంది.

- తాడి బోయిన రామస్వామి యాదవ్, లింగంపల్లి మాజీ కౌన్సిలర్

చెత్త కుప్పలను తొలగించాలి

రోజుల తరబడి చెత్తను తరలించకపోవడంతో చెత్త పేరుకుపోయి మురుగువాసనతో పాటు తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. పేరుకుపోయిన చెత్త కుప్పలను వెంటనే తొలగించాలి. ఇలా చెత్త పేరుకుపోకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి.

- కృష్ణ యాదవ్, మసీదుబండ

పేరుకు పోయిన చెత్తను తరలిస్తాం

ఈ మధ్యకాలంలో కొన్ని సాంకేతిక కారణాల వల్ల చెత్త కుప్పలు పేరుకుపోయిన మాట వాస్తవమే. పేరుకు పోయిన చెత్తను తరలిస్తాం. ఇక ముందు చెత్త కుప్పలు ఏరోజుకు ఆరోజు తరలించే విధంగా చర్యలు తీసుకుంటాం.

- ఏఎంహెచ్ఎఓ శ్రీకాంత్ రెడ్డి, శేరిలింగంపల్లి సర్కిల్


రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

ఇచ్చిన హామీ నేరవేర్చిన కాంగ్రెస్ : జగదీశ్వర్‌గౌడ్

హైదర్‌నగర్, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీతో రేషన్ సన్నబియ్యం అమలు చేయడం జరిగిందని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. శనివారం వివేకానందనగర్ డివిజన్ రేషన్ దుకాణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ చరిత్ర సృష్టించిందని, ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 89.95లక్షల రేషన్ కార్డు దారులకు రూ.2.81కోట్ల మంది అర్హులకు లబ్ధి చేకూరుతుందన్నారు. రాష్ట్రంలో పేదలందరికి ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందని, రాష్ట్రంలో దాదాపు 84 శాతంమంది పేదలకు ప్రభుత్వం ఉచితంగా సన్న బియ్యం అందించబోతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, డివిజన్ అధ్యక్షుడు బాషిపాక యాదగిరి, రంగారెడ్డి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు కల్పన ఏకాంత్‌గౌడ్, నాగమణి, భాస్కర్, ముకన్న, పరశురాములు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.


చెట్లకొమ్మల కటింగ్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : నార్నె

హైదర్‌నగర్, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ అల్లాపూర్ సొసైటీ కాలనీలో ఉన్న చక్రనిలయం అపార్ట్‌మెంట్ ప్రజలు ఎండిపోయిన చెట్ల వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన శనివారం హార్టికల్చర్ అధికారులతో క్రేన్ తెప్పించి దగ్గరుండి చెట్లకొమ్మలను ట్రిమ్మింగ్ చేయించారు. స్థానికంగా ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషిచేస్తానని కార్పొరేటర్ స్థానికులకు హామీనిచ్చారు. కార్యక్రమంలో హార్టికల్చర్ విభాగం అధికారులు దాసు, లైన్‌మెన్ కాలి, స్థానికులు అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొండావిజయ్‌తో కలిసి ఉత్తమ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న కార్పొరేటర్ హేమ శ్యామల

చిన్నారుల చదువుకోసం లయన్స్ క్లబ్ చేయూత

భెల్‌కాలనీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): చదువులో రాణిస్తున్న ఉత్తమ విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్- హోప్ సంస్థ చేయూత అందించింది. విద్యను అభ్యసిస్తూ ఫీజు చెల్లింపు విషయంలో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు వి.భావన (6వ తరగతి), వి.సాయి నిఖిల్ (4వ తరగతి) విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేసింది. చందానగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్ విద్యార్థుల చదువు కోసం రూ.20వేల చెక్కును సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ శ్యామల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ ముదిరాజ్, మధుసుదన్ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రాజశేఖర్, మారం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న టీఎన్‌జీవో కాలనీ వాసులు

మా కాలనీలో హాస్టల్స్, షేరింగ్ రూమ్స్ వద్దు

రాయదుర్గం, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి టీఎన్‌జీవో కాలనీలో హాస్టల్స్ కో-లివింగ్, పీజీలు, షేరింగ్‌రూమ్స్ ఓయూరూమ్స్ గెస్ట్‌హౌస్‌లతో ఎక్కడా ప్రశాంతత లేకుండా పోతుందని కాలనీ వాసులు శనివారం ఆందోళన నిర్వహించారు. కాలనీలో ఉన్న హాస్టల్స్‌తో ప్రశాంతత లేకుండా పోతుందని, అసౌకర్యాన్ని సృష్టిస్తున్నారని వెంటనే వీటిని ఖాళీ చేయించాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. హాస్టళ్ల వల్ల తాగు, డ్రైనేజీ, పార్కింగ్ వంటి సమస్యలు తలెత్తుతున్నాయని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


నల్లగండ్ల చౌరస్తాలో నిర్మించిన నూతన కళాతోరణం

నల్లగండ్ల ప్రధాన కూడలికి సరికొత్త కళ

భెల్‌కాలనీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు జీహెచ్ఎంసీ చేపడుతున్న సుందరీకరణ పనుల్లో భాగంగా శేరిలింగంపల్లి టీ జంక్షన్‌కు సరికొత్త కళను తీసుకువచ్చింది. ఇప్పటికే నగరాన్ని రూపుమాపుతూ విశ్వనగరంగా తీర్చిదిద్దుతున్న బల్దియా ప్రధాన జంక్షన్‌లను అభివృద్ధి పరుస్తూ సుందరంగా ముస్తాబుచేస్తోంది. విదేశీ తరహాలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పాదచారుల భద్రతతో పాటు సులభంగా వెళ్లడం, వాహనాలవేగాన్ని తగ్గించడం, ప్రమాదాలను అరికట్టడమే లక్ష్యంగా ఉన్నత ప్రమాణాలతో జంక్షన్‌లను అభివృద్ధి పరుస్తున్న జీహెచ్ఎంసీ అందుకు తగ్గట్టుగా నిర్మాణ పనులు చేపట్టి అందరి మన్ననలు పొందుతోంది. ప్రణాళికలో భాగంగా శేరినల్లగండ్ల టి.జంక్షన్‌లో భారీ ఫౌంటెన్‌ను నిర్మించింది. మూడు వైపుల నుండి వచ్చే వాహనదారులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్ది రంగురంగుల పూలమొక్కలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించింది. నిత్యం వేగంగా వచ్చే వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన ట్రీమౌంట్ విశేషంగా ఆకట్టుకుంటోంది. వాహనాల వేగాన్ని నియంత్రించడంతో పాటు నిత్యం ఈ చౌరస్తాలో ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీల సమస్యకు పరిష్కారం దొరికిందంటూ పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేం

జయంతి వేడుకల్లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన నేతలు, ఉద్యోగులు


వివేకానందర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, తదితరులు


కొండాపూర్ పోలీస్ బెటాలియన్‌లో నివాళులు అర్పిస్తున్న కమాండెంట్


భెల్‌కాలనీలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఈడీ కెబి.రాజా


మసీద్‌బండలోని బీజేపీ కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న రవికుమార్‌యాదవ్

హైదర్‌నగర్, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉపప్రధాని స్వర్గీయ బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని ఆల్విన్‌కాలనీ, వివేకానంద నగర్, హైదర్‌నగర్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. వివేకానందనగర్‌లో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

భెల్‌కాలనీలో..

భెల్‌కాలనీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దేశంకోసం అహర్నిశలు శ్రమించి, త్యాగాలు చేసిన మహనీయుల ఘన చరిత్రలు చిరస్థాయిగా మిగిలిపోతాయని భెల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెబి.రాజా అన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ 117వ జయంతి వేడుకలను బీహెచ్ఈఎల్ పరిశ్రమలో ఘనంగా నిర్వహించారు. కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉన్నతాధికారులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలు విభాగాల జనరల్ మేనేజర్లు, గుర్తింపు కార్మిక సంఘాలు, అసోసియేషన్‌ల ప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్‌ల కార్యవర్గ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో..

గచ్చిబౌలి, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లిలోని పలు ప్రాంతాల్లో జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వెస్ట్‌జోన్ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఉప కమిషనర్ ప్రణీత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కొండాపూర్‌లోని పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ రామకృష్ణ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ కార్యాలయంలో రవికుమార్‌యాదవ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వైభవంగా సీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు


భెల్ ఎంఐజీకాలనీలో సీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు


పట్టువస్త్రాలను సమర్పిస్తున్న కమిటీ సభ్యులు

భెల్‌కాలనీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మేళ తాళాలు.. మంగళవాయిద్యాల నడుమ శ్రీ సీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు శనివారం కాలనీ పురవీధుల్లో కన్నుల పండువగా సాగింది. భెల్ ఎంఐజీ కాలనీలో గల శ్రీ రామాలయంలో ఆదివారం జరుగనున్న శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా గతవారం రోజులుగా వసంత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతుండగా, ఆదివారం జరిగే వేడుకలకోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. పుష్పాలంకరణలతో కల్యాణమండపంతో ముస్తాబవ్వగా శనివారం ఉత్సవ మూర్తుల ఊరేగింపు కాలనీ పురవీధుల్లో ఘనంగా జరిగింది. కల్యాణానికి పట్టువస్త్రాలు, తలంబ్రాలను ఆలయ కమిటీ సభ్యులు ఊరేగింపుతో తీసుకువచ్చారు. అనంతరం స్వామి గర్భాలయంలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. కల్యాణం కోసం ఆలయం ఎదుటగల మైదానంలో భారీ టెంట్లను ఏర్పాటు చేశారు.

కల్యాణానికి ఆలయాల ముస్తాబు

మియాపూర్, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): శ్రీ సీతారాముల కల్యాణానికి నియోజకవర్గంలోని స్వామివారి ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ప్రధానంగా ప్రశాంత్‌నగర్, దీప్తిశ్రీనగర్ ధర్మపురి క్షేత్రం, మాదాపూర్, కొండాపూర్, చందానగర్, రాయదుర్గం, గచ్చిబౌలి, మదీనగూడ, హఫీజ్‌పేట ప్రాంతాల్లో ఉన్న దేవాలయాల్లో చలువ పందిళ్లు, భక్తులు కూర్చునేందుకు, అన్నప్రసాద వితరణకు ఆలయ కమిటీల ఏర్పాట్లు పూర్తిచేశారు. శ్రీరామనవమి సందర్భంగా ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ నియోజకవర్గ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. సీతారాముల కల్యాణంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

ఇళ్లమధ్యలో డ్రైనేజీ పనులు నిలిపివేయాలి


డ్రైనేజీ వద్ద పనులు ఆపాలని బోర్డు ఏర్పాటు చేసిన కాలనీ వాసులు

మియాపూర్, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): తమ కాలనీల మధ్యలోనుంచి వర్షం, డ్రైనేజీ కాల్వ పనులు వెంటనే నిలిపివేయాలని సహజసిద్ధంగా ఉన్న పాత నాలా ద్వారా వరద, డ్రైనేజీ నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని పలు కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాలు, కాలనీల వాసులు శనివారం వీడియోకాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, టేకునర్సింహనగర్‌లో జరుగుతున్న డ్రైనేజీ, వరదనీటి పనులను వెంటనే నిలిపివేయాలని, బోర్డును ఏర్పాటు చేసి ఆందోళనకు దిగారు. గుర్నాథం చెరువు నుండి పటేల్‌చెరువుకు గతంలో ఉన్న పాత నాలా ద్వారా నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎన్‌డీపీ ఉన్నతాధికారులకు త్వరలో ఫిర్యాదు చేస్తామన్నారు.

స్పందించిన కార్పొరేటర్

కార్పొరేటర్ శ్రీకాంత్‌ను వివరణ కోరగా ఎస్ఎన్‌డీపీ అధికారులు ఈ ప్రాజెక్టును రూపకల్పన చేశారని, గతంలో ఉన్న పాత నాలాను విస్తరించడానికి అక్కడ సరిపడా స్థలం లేకపోవడం, ఒకవేళ నాలాను విస్తరించినట్లయితే సమస్యలు తలెత్తే ప్రమాదం ఉన్నందున అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

'ప్రజాస్వామ్యంలో సవాళ్లు' పై సదస్సు

మియాపూర్, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో 'ప్రజాస్వామ్యంలో భారతదేశంలోని ప్రస్తుత ధోరణులు, దాని అవతల' అనే అంశంపై ఒక ఇంటరాక్టివ్ సెమినార్ నిర్వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి రిటైర్డ్ ప్రొఫెసర్, జర్నలిస్ట్, మీడియా నిపుణుడు డాక్టర్ పద్మజాషాతో పాటు పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యానికి ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లను వివరించారు. అసమానత, పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, రాజకీయ అవినీతి సవాళ్ల పరిష్కారాలను కనుగొనే లక్ష్యంతో ప్రగతిశీల ఆలోచనాపరులు అధ్యయనం చేయడానికి కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ మురళీ, ప్రొఫెసర్ అజయ్ గుడవర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు : గాంధీ

భెల్‌కాలనీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అన్నారు. చందానగర్‌లో గల క్రిస్టల్ గార్డెన్స్‌లో పిఆర్‌కె.చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ, ప్రభుత్వం మహిళలకు చేయూతనందించేందుకు అనేక పథకాలను ప్రవేశపెట్టి ఆర్థికంగా.. సామాజికంగా అండగా ఉంటుందన్నారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు ముందడుగు వేయాలని, సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌కె ఫౌండేషన్ చైర్మన్ కోటేశ్వరరావు, డివిజన్ సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డి, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన వారికి జ్ఞాపికలను ఎమ్మెల్యే అందజేశారు.


రాజీవ్‌గృహకల్పలో వైష్ణవి దేవికి పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా వైష్ణవీ మాత పూజలు

చందానగర్, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): హైందవ సంస్కృతి, సంప్రదాయాల్లో వసంత నవరాత్రులకు ఓ ప్రత్యేకత ఉంది. శక్తిపీఠమైన శ్రీ వైష్ణవీదేవి మాతను ఉగాది రోజు ప్రతిష్ఠించి తొమ్మిది రోజులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి అనంతరం అమ్మవారిని నిమజ్జనం చేస్తారు.. అందులో భాగంగా శేరిలింగంపల్లి డివిజన్ రాజీవ్‌గృహకల్పలో గత మూడు సంవత్సరాల నుంచి వైష్ణవీ మాతను మండపంలో ప్రతిష్ఠించి ఆగమన శాస్త్ర యుక్తంగా పూజలు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా వేడుకలను అంగరంగ వైభవంగా చేస్తున్నారు. శనివారం అమ్మవారికి అభిషేకం, అర్చనలు, పుష్పాలంకరణ చేసి భక్తి శ్రద్ధలతో కొలిచారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు ఉన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు

చందానగర్, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): చందానగర్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన పూజల్లో భాగంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు స్వామివారిని అనేక రకరకాల పుష్పాలతో అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చక బృందం తదితరులు ఉన్నారు. చందానగర్ హుడాకాలనీ హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ కొండా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వర స్వామికి పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, భక్తులు ఉన్నారు.

వేంకటేశ్వరస్వామి ఊరేగింపు


స్వామి వారి ఊరేగింపు

హైదర్‌నగర్, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి.

శనివారం విష్ణుసహస్ర నామస్తోత్ర పారాయణం, సుదర్శన హోమం, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం రథోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

దీప్తిశ్రీనగర్‌లో రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

మియాపూర్, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): అధ్వానంగా మారిన దీప్తిశ్రీనగర్ రహదారుల్లో గుంతలుగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరారు. దీప్తిశ్రీనగర్ పార్కు మలుపు నుంచి ఎంఏనగర్, ప్రశాంత్‌నగర్‌కు వెళ్లే మలుపుల వద్ద శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.



ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | హరిబాబు : 99854 11086


విద్యుత్ కాంతుల్లో దూలపల్లిలోని సీతారామ స్వామి ఆలయం

● శ్రీరామనవమికి ఆలయాలు ముస్తాబు



కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని దేవాలయాలు విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం ఉదయం నుంచి భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు ఏర్పాటు పూర్తి చేశారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకొని విశేష పూజలు నిర్వహిస్తారు. రద్దీ దృష్ట్యా ఆయా ఆలయ కమిటీలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు .. జీవితంపై విరక్తి చెంది మరొకరు

● వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

● పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధిలో ఘటనలు

పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆర్థిక ఇబ్బందులతో ఒకరు, జీవితంపై విరక్తి చెంది మరొకరు బలవన్మరణం చెందారు. పేట్ బషీరాబాద్ పరిధిలో ఈ ఘటనలు జరిగాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

ఒడిశా రాష్ట్రం బేతాల్‌పూర్ గ్రామానికి చెందిన ఇందిరా దూమియా(26) ఉపాధి కోసం రెండు సంవత్సరాల క్రితం కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో ఉన్న సుభాష్‌నగర్‌కు వలసొచ్చి ఇక్కడే నివాసముంటున్నాడు. అతనొక ప్లంబర్ కాంట్రాక్టర్. పనులు సరిగా జరగకపోవడం, దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు అధికమవడంతో శుక్రవారం సాయంత్రం శేరిలింగంపల్లిలో ఉంటున్న తన అన్న అభినవ్‌కు ఫోన్ చేసి ఆర్థిక ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయని, చనిపోతున్నానని చెప్పాడు. వెంటనే అతనుండే చోటుకు రాగా అప్పటికే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అభినవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీకి పోలీసులు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తి చెంది..


నూకయ్య శెట్టి (ఫైల్)

విశాఖ జిల్లా నక్కపల్లికి చెందిన కొత్త నూకయ్య శెట్టి(62) మూడు సంవత్సరాల క్రితం ఉపాధి కోసం కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని గణేష్ హౌసింగ్ సొసైటీకి కుటుంబ సభ్యులతో కలిసి వలస వచ్చాడు. ఇక్కడే నివాసముంటున్నాడు. అతనికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారికి వివాహాలయ్యాయి. అయితే కుటుంబసభ్యులతో కాకుండా నూకయ్యశెట్టి ఒంటరిగా ఉండేవాడు. నిత్యం మానసిక ఆందోళనకు గురికావడం, ఇరుగు పొరుగు వారితో మాట్లాడక పోవడం చేసేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతను చెదలు నివారణ మందు తాగి శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేయగా గమనించిన కుటుంబసభ్యులు సమీపంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న నూకయ్య శనివారం మృతిచెందాడు. అల్లుడు అనిల్ ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

షటిల్ కాక్ తీస్తుండగా..

● విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


శేషుకుమార్ (ఫైల్)

పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతిచెందాడు. పేట్ బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్ర రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లా సామర్లకోట మండలం పవర గ్రామానికి చెందిన పిల్లి శేషకుమార్(41) ఉపాధి నిమిత్తం కుటుంబ సభ్యులతో వలస వచ్చి కుత్బుల్లాపూర్ సర్కిల్ వెన్నెలగడ్డలో నివాసముంటూ మూసాపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రైటర్‌గా పని చేస్తుంటాడు. శుక్రవారం సాయంత్రం పిల్లలు బస్తీలో షటిల్ ఆడుకుంటుండగా కాక్ ఎగిరి విద్యుత్ వైర్లపై పడింది. దాన్ని తీసేందుకు కేబుల్ వైర్‌ను విద్యుత్ తీగలపై విసిరాడు. విద్యుత్ సరఫరా అయి షాక్ తగిలి అతను అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ విఫలమై ప్రియుడి ఆత్మహత్య

● ఉరేసుకొని బలవన్మరణం


నాగరాజు (ఫైల్)

పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలం కావడంతో ఓ యువకుడు మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. పేట్ బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా కట్యూరు మండలం కరుకుర్తికి చెందిన మహేశ్వరం నాగరాజు(25) ఉపాధి కోసం ఇటీవల వలస వచ్చి కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని బ్యాంక్ కాలనీలో ఉన్న తన స్నేహితుల వద్ద ఉంటూ క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఓ యువతితో పరిచయం ఏర్పడి అది కాస్త ప్రేమగా మారింది. రోజూ సెల్‌ఫోన్‌లో చాటింగ్ చేసుకునేవారు. శుక్రవారం చాటింగ్ చేసుకుంటున్న సమయంలో ఇద్దరి మధ్య జరిగిన చిరు గొడవ నేపథ్యంలో మనస్తాపానికి గురై గదిలోని ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్నేహితుడు జితేందర్ పేట్ బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు సంఘటన స్థలానికి చేరుకున్న వారు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని గాంధీకి తరలించారు.


సంజయ్‌గాంధీనగర్‌లోని రేషన్ షాపు వద్ద నెలకొన్న రద్దీ

సన్నబియ్యం కోసం బారులు

సన్నబియ్యం కోసం రేషన్ షాపుల వద్ద లబ్ధిదారులు బారులు తీరారు. ఉగాది నుంచి ప్రభుత్వం నాణ్యమైన బియ్యం పంపిణీ చేస్తున్నది. కాగా శనివారం సంజయ్‌గాంధీనగర్ రేషన్‌షాపు 168నంబర్ వద్ద రద్దీ కనిపించింది. అయితే డీలర్లు.. లబ్ధిదారుల నుంచి అనూహ్య స్పందన వస్తోందన్నారు. సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.

- షాపూర్‌నగర్, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి)

ఆర్టిజన్‌ల చేతివాటం!

లైన్‌మన్‌కు సహాయకారిగా ఆర్టిజన్ విధులు నిర్వహించాలి. ఆయన సూచించిన పనులు ఆర్టిజన్ చేయాల్సి ఉంది. కానీ పని ప్రదేశానికి వెళ్లకుండానే ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని పనులు చేయిస్తున్నారు. దీంతో జనం వద్ద అందినకాడికి వారు దోచేస్తున్నారు. నియమ నిబంధనలు లెక్క చేయకుండా ప్యానల్ బోర్డులు సైతం పెడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ తరహా అవినీతి కార్యకలాపాలకు పలు అధికారుల అండదండలు ఉన్నట్లు సమాచారం.

● ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటు చేసుకొని అవినీతి కార్యకలాపాలు
● కొంతమంది అధికారుల అండ
● జనం నుంచి అందినకాడికి దోపిడీ
● మేడ్చల్, జీడిమెట్ల డివిజన్‌లలో దుస్థితి ఇదీ..


కుత్బుల్లాపూర్ విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్, జీడిమెట్ల డివిజన్‌లలోని కొందరు ఆర్టిజన్‌లు విద్యుత్ వినియోగదారుల వద్ద అందిన దండుకుంటున్నారని సమాచారం. కేవలం పనులను ఫోన్‌లలో పర్యవేక్షిస్తున్నారు. వారు సొంతగా పెట్టుకున్న ప్రైవేట్ వ్యక్తులతో పనులు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. వీరు ఇష్టమొచ్చిన విధంగా అక్రమ వసూళ్ల పాల్పడుతున్నారని తెలుస్తోంది. ఉదాహరణకు ఒక టైటిల్ ఛేంజ్ కావాలంటే వినియోగదారుడు కేవలం రూ.45.. డీడీ రూపంలో ప్రభుత్వానికి చెల్లించాలి. కానీ ప్రైవేట్ వ్యక్తులు ఒక్కొక్కరి వద్ద రూ. 2 వేల నుంచి రూ. 4 వేల వరకు వసూలు చేసున్నారని వినికిడి. అందులో సెక్షన్‌లో కొంత ముట్టచెప్పి మిగతావి తమ జేబులో వేసుకోవడం, కొత్త మీటర్లకు సుమారుగా రూ.3,200 వరకు ఉండగా రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు వసూలు చేస్తుండటం జరుగుతుందనే ఆరోపణలు వస్తున్నాయి.

ప్రైవేట్ మీటర్ రీడర్లు..

అన్ని సెక్షన్‌లలో విద్యుత్ బిల్లులు వేసేందుకు ప్రైవేట్ మీటర్ రీడర్లు పని చేస్తారు. వీరికి కాంట్రాక్టు పద్ధతిలో ఒక్కో బిల్లుకు రూ.2ల చొప్పున కాంట్రాక్టర్లు జీతం చెల్లిస్తారు. ఇలా ఒక్కొక్కరు 2 వేల నుంచి 4 వేల వరకు రీడింగ్ చేసే అవకాశం ఇస్తారు. రీడింగ్ చేయగా వచ్చే జీతంతో పాటు ఆర్టిజన్‌లు అన్ అఫీషియల్‌గా కొంత జీతం చెల్లిస్తారు. ఆర్టిజన్‌లు మాత్రం కేవలం ప్రభుత్వ జీతాలను తీసుకుంటూ వారి పనిని రీడర్లతో చేయిస్తున్నారని సమాచారం. ఒక్కో ఆర్టిజన్‌కు రూ.35 వేల నుంచి రూ.55 వేల వరకు జీతం ఉంటుంది. అయితే రీడర్లకు రూ.10 వేలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. మేడ్చల్ డివిజన్‌లో 200 వరకు, జీడిమెట్ల డివిజన్‌లో 100 వరకు ప్రైవేటు రీడర్లు తెలిసింది.


ఎలాంటి సేఫ్టీ లేకుండా రామకృష్ణానగర్‌లో స్తంభం ఎక్కి పనులు చేస్తున్న ప్రైవేట్ వ్యక్తి

సేఫ్టీ ఉండదు..

ఆర్టిజన్ సిబ్బంది అయితే అన్ని రకాల నిబంధనాల పాటిస్తారు. కానీ ప్రైవేట్ సిబ్బందికి ఎలా చేయాలో తెలిసినా సేఫ్టీ పాటించరు. ఎర్త్ రాడ్, హెల్మెట్, బెల్ట్, సేఫ్టీ ప్రికాషన్స్ లేకుండా పని చేస్తున్నారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదు వస్తే రీడర్లు వెంటనే వెళ్లి విద్యుత్ పోల్స్ ఎక్కి మరమ్మతులు చేపడుతున్నారు. సేఫ్టీ అవగాహన లేకుండా చేయడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు. ఆర్టిజన్‌లు సూపర్ వైజర్లుగా చెలామణి అవుతూ ఉన్నతాధికారులకు కొంత ముట్టచెప్పి అందినకాడికి సంపాదిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఒకవేళ అధికారులు వినకుంటే వారిని బ్లాక్ మెయిల్ చేసి బెదిరిస్తున్నట్లు సమాచారం. ఇలాంటి సంఘటనలు ఇటీవల జగద్గిరిగుట్టలో చోటుచేసుకోగా ఉన్నతాధికారులు కలుగజేసుకుని ఇరువురికి సర్దిచెప్పినట్లు సమాచారం.

● జనవరిలో జగద్గిరిగుట్ట సెక్షన్ పరిధిలోని శివనగర్‌లో ఒక వినియోగదారురాలికి ఎలాంటి అనుమతులు లేకుండా ఏకంగా ప్యానల్ బోర్డులను పెట్టినట్లు సమాచారం. ఆ బస్తీలో ప్యానల్ బోర్డులు పెట్టేందుకు వీల్లేదు. కానీ ఆర్టిజన్ సిబ్బంది రూ.2.5 లక్షలను తీసుకుని దాన్ని ఏర్పాటు చేస్తానని చెప్పి కాలం వెళ్లదీస్తుండడంతో బాధితులు ఏడీఈ, డీఈలకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కానీ అక్కడి నుంచి ఎలాంటి సమాధానం రాకపోయినా కొన్ని గంటల్లోనే స్థానిక అధికారుల అండతో ప్యానల్ బోర్డును ఏర్పాటు చేశారని తెలుస్తోంది. బిగించగా వచ్చిన సొమ్ములో పైస్థాయి సిబ్బంది, స్టాఫ్‌కు కొంత ఇచ్చేలా ఒప్పందముందట. కానీ ఇవ్వకుండా దొరికినంత దోచుకోవడంతో ప్రస్తుతం గొడవలు జరుగుతున్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం.

ఏడీఈ శ్రీకాంత్ వివరణ

నిబంధనలు పాటిస్తేనే ప్యానల్ బోర్డు ఇస్తున్నాం. అయితే ఇటీవల అనధికారికంగా ఏర్పాటు చేసిన విషయమై ఒక ప్రాంతంలో గొడవైంది. ఈ విషయం మీకు తెలుసా? అని అడుగగా.. నా దృష్టికి రాలేదన్నారు.

జగ్జీవన్ సేవలు చిరస్మరణీయం

బాబు జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ఆయన చిత్రపటాలు, విగ్రహాల వద్ద పూలమాలలు వేసి ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు, వివిధ సామాజిక సేవా సంఘాల నేతల నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుల రహిత సమాజం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయా ప్రాంతాల్లో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జోన్ బృందం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి)


షాపూర్‌నగర్: నివాళులు అర్పిస్తున్న శ్రీశైలంగౌడ్



గండిమైసమ్మ చౌరస్తాలో మల్లయ్య తదితరులు


గాంధీనగర్‌లో...


కొంపల్లిలో జగ్జీవన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీపీసీసీ లేబర్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి తదితరులు


కుత్బుల్లాపూర్ మున్సిపల్‌లో ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు యాదగిరి తదితరులు


కొంపల్లిలో.. నివాళులర్పిస్తున్న మాజీ సర్పంచ్ దేవేందర్

● బీజేపీ కొంపల్లి పురపాలక సంఘం అధ్యక్షుడిగా సతీష్‌సాగర్

బీజేపీ కొంపల్లి పురపాలక సంఘం అధ్యక్షుడిగా పెద్దబుద్దుల సతీష్ సాగర్‌ను నియమితులయ్యారు. ఆ మేరకు నియామక పత్రాన్ని ఎన్నికల అధికారి తల్లోజు ఆచారి, ఎంపీ ఈటల రాజేందర్ అందజేశారు.


పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి)

సీఎంఆర్ఎఫ్ ఓ సంజీవని

నిజాంపేట్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఒక సంజీవని వంటిదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్‌కు చెందిన పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు బాచుపల్లి పార్టీ కార్యాలయంలో ఆయన అందజేశారు. కార్యక్రమంలో సంజీవ రెడ్డి, వెంకటేష్, జీవన్‌రెడ్డి, అంజద్, లాయక్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీలు



పేట్ బషీరాబాద్ : ర్యాలీ నిర్వహిస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి తదితరులు

పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : జై బాపు.. జై భీమ్, జై సంవిధాన్‌లో భాగంగా జీడిమెట్ల డివిజన్‌లోని సుచిత్ర, ప్రసూననగర్, రాఘవేంద్రకాలనీలలో ర్యాలీ నిర్వహించారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, కుత్బుల్లాపూర్ కో ఆర్డినేటర్ ఉజ్మా షాకీర్‌లు స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మహనీయులను స్మరించుకుంటూ నినాదాలు చేశారు.

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పాదయాత్ర

నిజాంపేట్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జైబాపు జైభీమ్ జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 2, 22, 23వ వార్డుల్లో కొలన్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులతో కలిసి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింసా పద్ధతిలో పోరాడి, ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన మహాత్మాగాంధీతో పాటు బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు అవమాన పరుస్తున్నాయన్నారు. అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా హోమ్‌శాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో వ్యాఖ్యలు చేయడమే నిదర్శనమని అన్నారు. తొలుత అందరూ కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంసీ మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, మాజీ కార్పొటర్లు, పలు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేట్ : ప్రతిజ్ఞ చేస్తున్న నర్సారెడ్డి భూపతి రెడ్డి తదితరులు









ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
పున్నారావు: 9985921366